# దీక్ష స్ఫూర్తితో కాంగ్రెస్‌ను దించుదాం

## కేసీఆర్ దీక్షతోనే సబ్బండ వర్గాల ఏకం

## కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా?

### రాష్ట్రాన్ని నం.1గా నిలిపిన చరిత్ర ఆయనది
### రేవంత్ ఎన్నడన్న జైతెలంగాణ అన్నడా?
### తెలంగాణ కోసం రాజీనామా చేసిండా?
### మాపై 350కి పైగా ఉద్యమ కేసులున్నయి
### రేవంత్ మీద ఒక్క ఉద్యమ కేసైనా ఉన్నదా?
### సిద్దిపేట దీక్షా దివస్‌లో మాజీ మంత్రి హరీశ్

సిద్దిపేట,నవంబర్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ నిబద్ధత, చిత్తశుద్ధి వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజలే శ్వాసగా, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. 'కేసీఆర్ దీక్ష స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించేదాకా అందరం ఒక్కటై కొట్లాడుదామని సంకల్పం తీసుకుందాం.. లగచర్లలో కొట్లాడింది బీఆర్‌ఎస్.. హైడ్రాకు వ్యతిరేకంగా కొట్లాడింది బీఆర్‌ఎస్.. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన కొట్లాడుతన్నది బీఆర్‌ఎస్.. నాటి ఉద్యమ స్ఫూర్తితో ముందుకుసాగి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం' అని పిలుపునిచ్చారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని ముందుగా సిద్దిపేటలోని ప్రశాంత్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, సీనియర్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, వేలేటి రాధాకృష్ణశర్మ, రాజనర్సు, సంపత్‌రెడ్డి, వేలాది మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాల వేశారు. అనంతరం రంగధాంపల్లి వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను తిలకించారు. ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పార్టీ జెండాను అవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ మాట్లాడుతూ.. 1956లో తెలంగాణను ఆంధ్రలో కలపడంతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు. 1969 ఉద్యమంలో 369 మంది చనిపోయారని, ప్రొఫెసర్ జయశంకర్ జీవితమంతా తెలంగాణ కోసం అంకితం చేశారని చెప్పారు. కేసీఆర్ లాంటి నాయకుడు రాకపోతాడా ? అని జయశంకర్ సార్ తపించారని, అదే సమయంలో కరెంట్ బిల్లులు పెరగడంతో నాడు రైతుల కోసం జై తెలంగాణ అని కేసీఆర్ బయల్దేరారని, 2001 ఏప్రిల్ 27న జల దృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారని గుర్తుచేశారు. పార్టీ ఏర్పడిన తొలినాళ్లలోనే కరీంనగర్, నిజామాబాద్ జిల్లా పరిషత్తులను గెలుపొందామని, 2004లో తెలంగాణ ఇస్తామని ఒప్పుకుంటేనే కాంగ్రెస్‌తో కేసీఆర్ పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. దాదాపు 26 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారని, యూపీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు తాను మంత్రి పదవి కోసం ఢిల్లీకి రాలేదని.. తెలంగాణ రాష్ట్రమే ముఖ్యమని కేసీఆర్ చెప్పారని, నాడు పట్టుబట్టి కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణను పొందుపరిచేలా కేసీఆర్ ఒత్తిడి తెచ్చారని వివరించారు. నాటి రాష్ట్రపతి ఉభయ పార్లమెంట్ సభల్లో తెలంగాణ ఏర్పాటు గురించి చెప్పారని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ అగ్ర నాయకుడు, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన పుస్తకంలో రాశారని గుర్తుచేశారు. 'కేసీఆర్‌లో ఆ నిబద్ధత, నిజాయితీ చూశానని పుస్తకంలో ప్రణబ్ ముఖర్జీ రాసిండ్రు. కేసీఆర్ గురించి ఈరోజు చాలా మంది ఏదేదో మాట్లాడుతున్నరు.. నాడు కేసీఆర్ మంత్రి పదవి గురించి ఆలోచించి ఉంటే నేడు తెలంగాణ వచ్చేదే కాదు' అని స్పష్టంచేశారు.

### ఎన్నోసార్లు రాజీనామా చేసినం

2004 నుంచి 2009 వరకు ఎన్నిసార్లు తెలంగాణ గురించి అడిగినా నాటి యూపీఏ ప్రభుత్వం పట్టించుకోలేదని హరీశ్ తెలిపారు. తమను అసెంబ్లీలో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఎంతో అవహేళన చేశారని వాపోయారు. 'ఇవ్వడానికి తెలంగాణ ఏమైనా సిగరెట్టా.. బీడీనా అని హేళనగా మాట్లాడిండ్రు.. హైదరాబాద్ వెళ్లాలంటే పాస్‌పోర్ట్, వీసా అవసరం ఉంటదని ఆంధ్రవాళ్లను కావాలని రెచ్చగొట్టిండ్రు. తెలంగాణ ఇవ్వకుండా అటు రాయలసీమ వాళ్లను రెచ్చగొట్టిండ్రు..నాడే టీఆర్‌ఎస్‌ను అంతం చేయాలని చూసి ఎమ్మెల్యేలను తీసుకున్నరు.. అయినా ఆగకుండా పోరాటం చేసినం' అని గుర్తుచేశారు. 2008లో ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామా చేసింది టీఆర్‌ఎస్ పార్టీ అని, ఎన్నోసార్లు రాజీనామా చేసి ఉద్యమాలు చేశామని, టీడీపీతో కూడా జై తెలంగాణ అనిపించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టంచేశారు. బీజేపీ ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని చెప్పి మోసం చేసిందని, అన్ని పార్టీలు తెలంగాణను వాడుకొని మోసం చేశాయని, అప్పుడే హైదరాబాద్ ఫ్రీ జోన్ అని ఆంధ్రా పాలకులు కుట్రలు చేస్తుంటే తెలంగాణ పిల్లలకు ఉద్యోగాలు దొరకయన్న ఆవేదనతో ఉద్యమానికి, ఆ సమయంలోనే సిద్దిపేటలో 'ఉద్యోగ గర్జన'కు కేసీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.


### ఎన్ని కేసులు పెట్టినా పోరాడినం..

'2009, అక్టోబర్ 12న సిద్దిపేట అంబేద్కర్ భవన్‌లో ఉద్యోగ గర్జన సభ సన్నాహక సమావేశం జరుగుతున్న సమయంలో అవసరమైతే తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు దిగుతానని కేసీఆర్ చెప్పారు.. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అన్న నినాదాన్ని నాడే ఇచ్చారు. 2009, అక్టోబర్ 21న సిద్దిపేటలో టీఎన్‌జీవో అధ్యక్షుడు స్వామిగౌడ్, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ ఆధ్వర్యంలో లక్షలాది మంది ఉద్యోగులతో అద్భుతమైన ఉద్యోగ గర్జన సభ జరిగింది. తర్వాత కేసీఆర్ సిద్దిపేట వేదికగా నవంబర్ 29న ఆమరణ దీక్షకు పూనుకున్నరు.. ఆ క్రమంలో అల్గునూరు వద్ద కేసీఆర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ఖమ్మం జైలుకు తరలించిండ్రు' అని హరీశ్ గుర్తుచేశారు. కేసీఆర్‌ను ఖమ్మం తరలిస్తే ఉద్యమం చల్లారుతుందని నాటి సీఎం రోశయ్య అనుకున్నారని, కానీ ఖమ్మం జైలు వద్దకు పెద్ద ఎత్తున ఉద్యోగులు, లాయర్లు, విద్యార్థులు, నాయకులు తరలివచ్చారని చెప్పారు. ఖమ్మం జైలులో కేసీఆర్‌తో పాటు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, నాయిని నరసింహారెడ్డి, రాజయ్య యాదవ్ లాంటి వాళ్లను కూడా నిర్బంధించారని, అప్పుడు తాము రంగధాంపల్లిలో దీక్షకు పూనుకుంటే అందర్నీ అరెస్ట్ చేసి వివిధ జైళ్లకు తరలించారని చెప్పారు. నాడు సిద్దిపేటలో ఎటు చూసినా పోలీసులే ఉన్నారని, అయినా కొన్ని వేల మంది దీక్షాస్థలికి వచ్చారని, ఎన్ని కేసులు పెట్టినా పోరాటం కొనసాగించామని గుర్తుచేశారు. డిసెంబర్ 3న ఖమ్మం నుంచి నిమ్స్‌కు కేసీఆర్‌ను తరలించారని చెప్పారు.

### కేసీఆర్ దీక్షతోనే సబ్బండ వర్గాలు ఏకం

రాజకీయ ప్రక్రియతో రాష్ట్రాన్ని సాధిద్దామని కేసీఆర్ అనుకుంటే తమతో పొత్తులు పెట్టుకున్న కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ తెలంగాణను మోసం చేశాయని, అప్పుడు గాంధీ అనుసరించిన మార్గంలో నడవాలని తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని హరీశ్ చెప్పారు. నాటి కేసీఆర్ దీక్ష సబ్బండ వర్గాలను ఏకం చేసిందని, పార్టీలకతీతంగా ప్రజలు ఏకమై ఉద్యమించారని తెలిపారు. 10 రోజుల దీక్ష తర్వాత ప్రతి ఒక్కరూ కేసీఆర్ ఆరోగ్యంపై ఆందోళన చెందారని, కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ జైత్రయాత్రా?.. కేసీఆర్ శవయాత్రా? అని పట్టుబట్టి దీక్ష కొనసాగించారని వివరించారు. కేసీఆర్‌కు ఏమైనా జరిగితే తెలంగాణ అగ్నిగుండమైతదని కేంద్ర ఇంటెలిజెన్స్ ద్వారా సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంమంత్రి చిదంబరం జయశంకర్ సార్‌తో ఫోన్‌లో మాట్లాడారని, అప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్రం ప్రకటన చేసిందని చెప్పారు. దీక్షా దివస్ వెనుక ఇంత పోరాటం ఉన్నదని, నాటి కేసీఆర్ ఆమరణ దీక్ష ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రమని స్పష్టంచేశారు. 'అప్పుడు తెలంగాణ అంతా పండుగలు చేసుకుంటుంటే.. ఆంధ్రా నాయకులు ఆ సంతోషాన్ని ఎక్కువ రోజులు ఉండనీయకుండా చేసింద్రు. వాళ్లు రాజీనామాలు చేస్తే డిసెంబర్ 23న ఇచ్చిన తెలంగాణను కేంద్రం వెనక్కి తీసుకున్నది. అప్పుడు తెలంగాణ సమాజం తెలంగాణ ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలంటే ఒక్క గులాబీ సైనికులు తప్ప ఏ పార్టీ ఎమ్మెల్యేలు కూడా చేయలేదని తెలిపారు. బీజేపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటే నేటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని రాజీనామా చేయిమంటే చేయకుండా ఢిల్లీకి వెళ్లలేదని, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా నాడు రాజీనామా చేయిమంటే కనీసం జిరాక్స్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడైనా జై తెలంగాణ అన్నడా ?.. తెలంగాణ కోసం ఎప్పుడైనా రాజీనామా చేసిండా ? కనీసం అమరులకు ఒక పువ్వయినా పెట్టి నివాళి అర్పించిండా ?' అని నిలదీశారు. 'మాపై 350కి పైగా కేసులున్నయి.. రేవంత్ మీద ఒక్క ఉద్యమ కేసైనా ఉన్నదా? ఓటుకు నోటు కేసు మాత్రం ఉన్నది' అని దుయ్యబట్టారు. 'తెలంగాణ ఉద్యమానికి గొప్ప చరిత్ర ఉన్నది.. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటే తెలంగాణ సాధనలో నేను సైతం అనే తృప్తి కంటే ఇంకేమి గొప్పది ఉండదు' అని తెలిపారు. 'గాంధీ నాయకత్వంలో నడిచిన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల్లా.. కేసీఆర్ నడిపిన తెలంగాణ ఉద్యమంలో మనందరిదీ అంత గొప్ప అనుభూతి.. అలాంటి తెలంగాణను సాధించి రాష్ట్రాన్ని కేసీఆర్ ఎంత గొప్పగా తీర్చిదిద్దారో గుర్తుచేసుకోవాలి' అని సూచించారు.

> కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రమే లేదు. ఉద్యమంలో జై తెలంగాణ అన్నోళ్ల మీద తుపాకీ ఎక్కుపెట్టిన నీ (రేవంత్‌రెడ్డి) మరక నిన్ను వెంటాడుతది.. రాజీనామా చేయకుండా వెన్ను చూపిన నీ మరక నిన్ను వెంటాడుతది.. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరు నిలిచి ఉంటది.. రాష్ట్రాన్ని కాపాడుకునే క్రమంలో ఆ రోజు కొందరు వచ్చి చేరిండ్రు.. ఇప్పుడు పాలేవో నీళ్లేవో తెలిసింది. ఆ దొంగలను మళ్లీ రానిచ్చే ప్రసక్తే లేదు. -హరీశ్‌రావు




సిద్దిపేటలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, యాదవరెడ్డి, వంటేరు, నాగిరెడ్డి, రాధాకృష్ణశర్మ తదితరులు

### రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దే

తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనని, తలసరి ఆదాయంలో, ధాన్యం పండించడంలో, జీఎస్‌డీపీలో, తాగునీటి సరఫరాలో, నిరంతర విద్యుత్తులో దేశానికి దిక్సూచిగా నిలిపారని హరీశ్ గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ ఇలా అన్నీ బంద్ అయ్యాయని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంపై కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్‌కు ఉన్నంత ప్రేమ ఏ పార్టీకీ ఉండదని స్పష్టంచేశారు.

> తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో అనే నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ తెగించిండ్రు.. 'ది కోయిలేషన్ ఈయర్స్ : 1996-2012' పుస్తకంలో కేసీఆర్ నిబద్ధత గురించి మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రస్తావించిండ్రు.. కేంద్రంలో ఏ శాఖ కావాలని కేసీఆర్‌ను అడిగితే.. ప్రణబ్‌జీ నా లక్ష్యం మీకు తెలుసు.. మీరు నాకు ఏశాఖను కేటాయించారనేది ముఖ్యంకాదు.. నాకు ప్రత్యేక తెలంగాణ కావాలి అని కేసీఆర్ చెప్పారని ప్రణబ్ తన పుస్తకంలో రాసుకున్నరు.. ఇదీ కేసీఆర్ కమిట్‌మెంట్‌కు నిదర్శనం – హరీశ్‌రావు



వరంగల్ జిల్లా ఉర్సులో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలోని కీలకమైన ఘట్టాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. తెలంగాణ అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ భారీ కటౌట్‌కు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పూలు చల్లి తన అభిమానాన్ని చాటుకున్నారు.



**కేసీఆర్ పాలనలో తెలంగాణ అగ్రగామి :** కేసీఆర్ పదేండ్ల పాలనలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాల, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌లో పాల్గొన్న శాసనమండలిలో బీఆర్‌ఎస్ నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావు, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్



**కేసీఆర్ లేకుంటే తెలంగాణ పదమే మాయమయ్యేది:** కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రం కాదు కదా, ఆ పదమే వినిపించకుండా పోయేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్, రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**కేసీఆర్ ఉద్యమ ఫలితమే బంగారు తెలంగాణ:** కేసీఆర్ ఉద్యమ ఫలితమే నేటి బంగారు తెలంగాణ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఉర్సులో నిర్వహించిన దీక్షా దివస్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.




**రాష్ట్రాన్ని పాలించే సత్తా రేవంత్‌కు లేదు:** రాష్ట్రాన్ని పాలించే సత్తా రేవంత్‌రెడ్డికి, మంత్రులకు లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్‌లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**జనం కేసీఆర్‌ను కోరుకుంటున్నరు:** ఏడాది కాలంలో ఏం కోల్పోయామో ప్రజలకు తెలిసొచ్చిందని, కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను లేకుండా చేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, దీక్షా దివస్ ఇన్‌చార్జి ఫారూఖ్ హుస్సేన్ పాల్గొన్నారు.



**కేసీఆర్ దీక్షతోనే కేంద్రం దిగొచ్చింది:** కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే కేంద్రం దిగొచ్చి తెలంగాణ ప్రకటించిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం దీక్షా దివస్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**కేసీఆర్‌పేరు చెరపడం రేవంత్ తరం కాదు:** తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ పేరును చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని దీక్షా దివస్‌కు మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధుకర్, దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.

**tifr TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH**
National Centre of the Government of India for Nuclear Science and Mathematics
Balloon Facility, P.B.No. 5, ECIL P.O., Hyderabad -500 062, Telangana, India

**Advertisement No. 01/2024**

Application is invited for the following post, in the pay scale mentioned plus the allowances, tenable at TIFR Balloon Facility, Hyderabad. Last date for receiving application is within 20 days from the date of publication of this advertisement.

1. **Scientific Officer (B) - One Post (01) (Un reserved):** Pay Level 8, Pay Stage 1, TME Rs. 92,616/-; Headquarters: Hyderabad.

Please visit our TIFR website: **www.tifr.res.in/~bf/careers.html** for complete advertisement and prescribed requirements.

Sd/-
Scientist-in-Charge

